క్లుప్తంగా

కోటసత్తెమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి దంపతులు



జడ్జి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ, అర్చకులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారిని రాజమహేంద్రవరం జిల్లా జడ్జి గంధం సునీత దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్‌లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సునీత దంపతులను సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతోనే చిన్నారులకు ఆరోగ్యం



తల్లిపాల ప్రాధాన్యంపై ఎస్.ముప్పవరంలో నిర్వహించిన అవగాహన సదస్సు

చాగల్లు: తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అనూష అన్నారు. చాగల్లు మండలం ఎస్.ముప్పవరం గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠకరంగ ఉపయోగపడతాయో అంగన్‌వాడీ పరిధిలోని తల్లులకు వివరణాత్మకంగా విశ్లేషించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, చంద్రకళ, ఏఎన్‌ఎమ్ బేబీ తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి గ్రామంలోని పాత పొగాకు పరిశ్రమ సమీపంలోని రోడ్డులో ఈ నెల 1వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనకనమెట్ట సావరంకు చెందిన అందే నరసింహ (59) తీవ్రంగా గాయపడి రాజమండ్రిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ఎస్సై రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. రైతు అయిన నరసింహ రావూరుపాడు గ్రామానికి తన బంధువుల ఇంటికి వెళ్లి పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా మలకపల్లి రోడ్డు సెంటర్ దగ్గర జరిగిన ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం క్షతగాత్రుడిని రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

చీమల మందు తాగి యువకుడు మృతి

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి వడ్డీల పేటకు చెందిన క్రొవ్విడి వీరాజు (25) చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ బుధవారం వెల్లడించారు. ఎస్సై వివరాలు ప్రకారం మృతుడు వడ్రంగి పనిచేస్తుంటాడని, వివాహం కాలేదని బాధితుడు ఈ నెల 2వ తేదీ రాత్రి చీమల మందును తాగడంతో బంధువులు 108లో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు అనంతరం అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నిడదవోలు రూరల్: బాపట్లలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి పోటీలకు నిడదవోలు మండలం పురుషోత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేవీఎస్‌ఆర్ ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఈ నెల 3న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో బహుళ క్రీడాపోటీలు (ట్రయాథ్లాన్) అండర్ -14 బాలుర విభాగంలో డి.వెంకటరమణ, ఏడీబీ కార్తీక్, 400 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ అండర్-18 విభాగంలో ఎస్.రాజులు ఎంపికై నట్టు ఆయన వివరించారు. విద్యార్థులను పాఠశాల పీడీ ఎన్‌టీ రామారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

గుట్టలో దాగిన గుట్టు

- ఇసుక నిల్వల్లో గందరగోళం
- అక్రమా మార్గాల్లో విక్రయాలు
- చూపించిన లెక్కలకు–ఉన్న స్టాకుకి తేడాలు

పెరవలి: గోదావరిలో ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ తీసుకొచ్చిన నూతన విధానాన్ని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి సొంత లాభం చూసుకుంటున్నారు. పర్యావరణ నిబంధనల ప్రకారం..జూన్ 1 నుంచి అక్టోబరు 15 వరకు గోదావరిలో ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి. దాంతో ఇబ్బంది రాకుండా..ముందుగా నిర్దేశించిన కేంద్రాల్లో నిల్వలు అందుబాటులో ఉంచాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగానే జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాట్లు చేసి కొన్ని లక్షల టన్నుల్లో ఇసుకను నిల్వలు చేసినట్లు అధికారులు లెక్కలు చూపించారు. ఇసుక స్టాక్ యార్డుల పేరిట అధికారికంగా వేసిన ఇసుక గుట్టల్లో మతలబును గ్రహించని అధికారులు అనధికారకంగా వేసిన ఇసుక గుట్టలను తరువాత అధికారిక గుట్టల్లో కలిపి ఇసుక అమ్మకాలు ప్రారంభించారు పాటదారులు. జిల్లాలో ఇసుక మాఫియా సాగిస్తున్న ఈ ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.

జిల్లాలో నిల్వలు ఎంత

అధికారులను అడ్డంపెట్టుకుని అనధికారికంగా దోచేయటానికి వేసిన దళారీల ప్లాన్ సక్సెస్ అవ్వగా అధికారులు మాత్రం బోల్తా పడ్డారు. ఇందుకు మండల స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు ముడుపులు బాగా ముట్టాయని చెప్పుకుంటున్నారు. జిల్లాలో 29 చోట్ల ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాట్లు చేసి అక్కడ 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేసినట్లు అధికారులు లెక్కలు చూపించారు. జిల్లాలో కొవ్వూరు నియోజక వర్గంలో అరికలరేవు, చిడిపి1,2, కుమారదేవం 1,2, కొవ్వూరులోను, నిడదవోలు నియోజకవర్గంలో కాకరపర్రు, తీపర్రు, పురుషోత్తపల్లి, జీడిగుంట, మునిపల్లి, సీతానగరంలో 6 పాయింట్లు, రాజమండ్రిలో 3 స్టాక్ పాయింట్లు, తాళ్లపూడిలో 7 పాయింట్లు, రంగంపేట గ్రామాల్లో ఒక్క స్టాక్ పాయింట్లు ఏర్పాట్లు చేశారు. నిల్వ చేసిన ఇసుకంతా కేవలం ఓపెన్ రీచ్‌ల నుంచి రాత్రి, పగలు యధేచ్ఛగా తోలకాలు చేయటంతో కేవలం 25 రోజుల వ్యవధిలో ఇంత ఇసుకను నిల్వను చేయగలిగారు.

అధికారిక గుట్టల్లో ఎలా కలిపారు..?

జిల్లాలో గోదావరి వరదల వలన ఇసుకకు ఇబ్బంది లేకుండా చూసేందుకు అధికారులు ఇసుక నిల్వలు చేయటానికి టెండర్లు పిలిచి స్టాక్ పాయింట్లు ఎంపిక చేసి 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు చూపించారు. అంతవరకు బాగానే ఉన్నా అసలు కిటుకు ఇక్కడే దాగి ఉంది. ఇసుక నిల్వలు చేసిన తరువాత మైనింగ్ అధికారులు నిల్వలను పరిశీలించి ఎంత నిల్వ చేశారో తనిఖీలు చేసి అధికారికంగా గుట్టల వద్ద స్టాక్ నిల్వలను చూపించే విధంగా బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం గోదావరికి వరదలు రావటంతో ఇసుక ర్యాంప్‌ల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను వరద ముసుగులో ఆ ఇసుకను తరలించి గుట్టల్లో వేశారు. దీనితో అక్రమ ఇసుక సక్రమం అయ్యింది. దీనితో అప్పటి వరకు గుట్టలుగా కనిపించిన ఇసుక ఇప్పుడు కొండలను తలపించే విధంగా ఉంది.

గుట్టలు కాస్తా కొండలుగా

కానూరు కొండలమ్మ గుడి వెనుక వేసిన (మునిపల్లి స్టాక్) అధికారిక గుట్టను ఒకసారి పరిశీలిస్తే ఇక్కడ అధికారికంగా స్టాక్ 52,652 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వ ఉన్నట్లు చూపించారు.



కానూరులో కొండలమ్మ గుడి వెనుక అధికారిక ఇసుక గుట్ట

కానీ ఇక్కడ మాత్రం సుమారు 80 వేల మెట్రిక్ టన్నులు నిల్వలు ఉన్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే కానూరు–పెండ్యాల ఇసుక ర్యాంప్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను గోదావరికి వరద ముసుగులో పగలు, రాత్రిళ్లు ఇసుకను తోలి అధికారిక గుట్టలో కలిపేశారు. దీనితో గుట్ట కాస్తా కొండైయ్యింది. కాకరపర్రు స్టాక్ పాయింట్‌లో 45 వేల మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వ ఉన్నట్లు చూపిస్తే ఇక్కడ కూడ కాకరపర్రు ఇసుక ర్యాంప్‌లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను ఆ తరువాత తీసుకు వచ్చి గుట్టలో కలిపివేశారు. దీనితో గుట్ట కాస్తా కొండైయ్యి కూర్చుంది. తీపర్రు ఇసుక ర్యాంప్‌లోను, ఉసులుమర్రు వద్ద నిల్వలను పరిశీలిస్తే ఇక్కడ అటు ఇటుగా లెక్కలకు, ఉన్న స్టాకుకు సరితూగుతుంది. ఇక్కడ నిల్వలు 65 వేల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు చూపించారు. అక్రమాలు మాత్రం కాకరపర్రు, తీపర్రు, పందలపర్రు, పురుషోత్తపల్లి, జీడిగుంట గుట్టల్లో నిల్వలు ఉంచినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఈ గుట్టలను ఒక సారి పరిశీలించి ఇసుకను కొలతలు వేస్తే అసలు నిజాలు బయటకు వస్తాయి. అంత సాహసం అధికారులు చేస్తారా లేక రాజకీయ ముసుగులో కప్పెట్టిస్తారా అన్నది చూడాలి.



కానూరు–పెండ్యాల ర్యాంప్‌లో ఖాళీ చేసిన అనధికార గుట్ట



కాకరపర్రులో అధికారిక ఇసుక గుట్ట



కాకరపర్రు ఇసుక ర్యాంప్‌లో వేసిన అనధికార గుట్ట



తీపర్రు ఇసుక ర్యాంప్‌లో వేసిన గుట్ట



ఉసులుమర్రులో ఇసుక గుట్ట

ఇస్కాన్ ఆలయం ప్రారంభం



తాళ్లపూడిలో ఇస్కాన్ ప్రతిష్ఠించిన నూతన విగ్రహాలు



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి: తాళ్లపూడిలో ఇస్కాన్ నూతన ఆలయాన్ని బుధవారం రాజమండ్రి ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ్ బలదేవ్ సుభద్రల విగ్రహాలను ఆవిష్కరించారు. రాజమండ్రి ఇస్కాన్‌కు చెందిన శ్రీ మాన్ శ్యామాంగ్ శ్రీనివాస్ దాస్ ప్రభుజీ అధ్వర్యంలో మహాహారతి, అనంతరం ఉత్సవ విగ్రహాలకు పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. చప్పన్ భోగ నైవేద్యాలు, సమర్పణ కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. ప్రాంగణమంతా హరే రామా, హరే కృష్ణా, గీతాలతో మారుమోగింది. నూతన ఆలయంలో శ్రీశ్రీ శ్రీల ప్రభు పాద స్వామి విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. ఎచ్ జి.సత్య గోపీనాథ్ ప్రభుజీ ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. అనంతరం మహాన్న ప్రసాద వితరణ చేశారు. మండలం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ఇస్కాన్ భక్తులు హాజరయ్యారు.

చరిత్ర మూలాలను మరవకూడదు



జాతీయ అంతర్జాల సదస్సుకు హాజరైన వక్తలు, విద్యార్థులు

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రెండో రోజు జాతీయ అంతర్జాల సదస్సును నిర్వహించారు. భారతీయ జ్ఞాన వ్యవస్థ వేదాల నుంచి కృత్రిమ మేధస్సు వరకు అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో 5 రాష్ట్రాలకు చెందిన 200 మంది పాల్గొన్నారని ప్రిన్సిపల్ డాక్టర్ కె. జ్యోతి తెలిపారు. వక్తలుగా ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఒ.మాధవి, తాడేపల్లిగూడెం డీఆర్జీ ప్రభుత్వ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు డాక్టర్ సుంకర గోపాలయ్య, రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడు డాక్టర్ నూజెళ్ల శ్రీనివాస్, కాకినాడ పీఆర్ కళాశాలకు చెందిన హిందీ అధ్యాపకుడు డాక్టర్ హరి రామప్రసాద్‌లు పాల్గొని ప్రసంగించారు. వక్తలు ప్రసంగిస్తూ ప్రాచీన భారతీయ జ్ఞాన సంపద, దాని మూలాలు ఆధునిక పరిణామాల మధ్య ఉన్న అనుసంధానాన్ని వివిధ దశలుగా విశ్లేషించారు. వేద కాలం నుంచి మొదలై కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు ఎలా ప్రయాణం సాగించిందో స్పష్టంగా వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి మాట్లాడుతూ భారతీయ జ్ఞాన వ్యవస్థ మూలాలను విద్యార్థులకు అందించడం ద్వారా ఈ తరం యువతలో మన దేశ వేద విజ్ఞానంపై గౌరవం, ఆసక్తి కలగడమే కాకుండా మరెన్నో కొత్త ఆవిష్కరణలకు నాంది పలకగలరని పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో అధ్యాపకులు ఎస్. మద్దిలేటి, ఎస్. ప్రసాదరావు, కె. జాస్మిన్, ఎస్ఎన్‌డీ లక్ష్మీదేవి, పి.శివాజీ, ఎంవీ వీరకళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు సారె–చీర సమర్పణ

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజు పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి శ్రావణ మాసం పురస్కరించుకుని జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం, బ్రాహ్మణ మహిళా సంఘం, నిడదవోలు బ్రాహ్మణ సంఘం సభ్యులు బుధవారం చీర- సారె సమర్పించారు. కోటసత్తెమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లోక కళ్యాణార్థం సనాతన ధర్మం కోసం అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, బ్రాహ్మణ సంఘం సభ్యులు జె.సుబ్రహ్మణ్యం, ముదునూరి వాణిశ్రీ, పి.గీత వరలక్ష్మి, శివాధాని, కందికొండ లోకభాస్కర్, పొన్న సుబ్రహ్మణ్యం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోటసత్తెమ్మ అమ్మవారికి శ్రావణ మాసం సారెను తీసుకువస్తున్న బ్రాహ్మణ సభ్యులు

ప్లాస్టిక్ నిషేధానికి పటిష్ట చర్యలు

నిడదవోలు రూరల్: పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్ల నిషేధానికి పటిష్ఠ చర్యలు తీసుకున్నట్లు ఈఓపీఆర్డీ డి.లక్ష్మినారాయణ తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం గ్రామ సచివాలయంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేదంపై కిరాణా, హోటల్స్ యజమానులతో అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ప్లాస్టిక్ విక్రయాలు చేసే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ లక్ష్మినారాయణ

హాల్ట్‌లు పునరుద్ధరణకు పచ్చజెండా

- రైళ్ల హాల్టింగ్స్‌కు ఆమోదం
- కొవ్వూరులో దక్షిణమధ్య రైల్వే జీఎం పర్యటన

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైళ్ల హాల్ట్‌లు పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ వాత్సవ తెలిపారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో సౌకర్యాలను, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరీతో పాటు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఇతర నాయకులు సికింద్రాబాద్ రైలు భవన్‌లో రైల్వే జీఎం శ్రీవాత్సవను కలిసి లాక్‌డౌన్ దృష్ట్యా కేంద్రం ప్రభుత్వం తీసుకున్న చర్యలో భాగంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లను రద్దు చేశారని ఈ నేపథ్యంలో రైల్వే హాల్టింగ్స్ లేక ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం కొవ్వూరు విచ్చేసిన ఆయనకు హైదరాబాద్, మద్రాసు, బెంగుళూరు, తిరుపతి. వెళ్లే ప్రయాణికులు రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వ్యయ ప్రాయాసలకు గురై రాజమహేంద్రవరం వెళ్లి రైళ్లు ఎక్కవలసి వస్తుందని, 2019 నాటికి ఉన్న 34 రైళ్లకు హాల్ట్‌లను పునరుద్ధిరించాలని కోరారు. అనంతరం రైల్వే జీఎం మాట్లాడుతూ కొవ్వూరు రైల్వే హాల్టింగ్స్ సమస్య తమ దృష్టికి వచ్చిందని తప్పకుండా అవసరమైన రైలు హాల్టింగ్స్‌ను కొవ్వూరు స్టేషన్లో పునరుద్ధరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఫిక్కీ నాగేంద్ర, కొవ్వూరు 9వ వార్డు మునిసిపల్ కౌన్సిలర్ మురళీ కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బోడపాటి ముత్యాలరావు, బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, కొవ్వూరు మండల అధ్యక్షురాలు డేగల సునీత, రైల్వే పరిరోణసమితి సభ్యులు వీటీ విల్సన్‌రాజ్, గారపాటి రామ్మోహనరావు, చామర్తి విశ్వనాథ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హాల్ట్‌లు పునరుద్ధరించాలని వినతి పత్రాలను అందిస్తున్న స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు



నిడదవోలు స్టేషన్‌లో అమృత్ భారత్ పనులను పరిశీలిస్తున్న శ్రీవాత్సవ

పనులను వేగవంతం చేయాలి

నిడదవోలు: విజయవాడ -రాజమహేంద్రవరం నగరాల మధ్య కీలకమైన జంక్షన్‌గా ఉన్న నిడదవోలు రైల్వే స్టేషన్లో అమృత భారత్ స్టేషన్ పథకంలో చేపడుతున్న ఆధునీకరణ పనులను బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం కుమార్ శ్రీవాస్తవ పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక రైలులో మధ్యాహ్నం 12.30 గంటలకు ఆయన నిడదవోలు స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. స్టేషన్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఎన్‌డ్ టు ఎన్‌డ్ ఫుట్‌పాత్ ఓవర్ బ్రిడ్జి పనులను, ప్లాట్‌ఫాం మధ్య ప్రయాణికుల రాకపోకలకు నిర్మిస్తున్న రెండు లిఫ్టు పనులను, ఎస్కలేటర్, అత్యాధునిక మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రైల్వే స్టేషన్ ముందు భాగంలో నిర్మిస్తున్న ఎలివేషన్ పనులు ఇంకా స్లాబ్ దశలోనే ఉండడంతో ఆయన అధికారులు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో వేగవంతంగా అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పూర్తి చేసిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఫొటోలతో పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఆర్‌ఎం మోహిత్ సోనాకియ, చీఫ్ ఇంజినీర్ సూర్యనారాయణ, సీనియర్ డెన్ కోఆర్డినేషన్ అధికారి ఎ.వరుణ్ బాబు, స్టేషన్ సూపరింటెండెంట్ పి.శ్రీరామరెడ్డి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోటా తగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



డాక్టర్ మౌనిక, జిల్లా అధ్యక్షురాలు, ఏపీపీహెచ్‌డీసీఏ

దేవరపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 2025-26 విద్యాసంవత్సరంలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ డాక్టర్లకు ఉన్న పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేట్) కోటాను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్ల అసోసియేషన్ (ఏపీపీహెచ్‌డీసీఏ) తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షురాలు, గౌరీపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.మౌనిక విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు వివరించారు. కేవలం జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజీ ఏడు క్లినికల్ శాఖలకే పరిమితం చేసినట్టు ఆమె వెల్లడించారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు ఇన్‌సర్వీస్ పీజీ కోటాపై అసోసియేషన్ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపాకనే ఏ నిర్ణయం అయినా తీసుకుంటామని ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. ఏవిధమైన అధికారిక సమాచారం లేకుండా మీడియా ద్వారా ప్రభుత్వ నిర్ణయం వెలుగులోకి రావడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. దీని వల్ల గిరిజన, పల్లెటూర్ల ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులను తీవ్రంగా నిరూత్సహపర్చేలా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో భవిష్యత్తులో పల్లెటూర్లలో పనిచేయడానికి ఆసక్తి చూపే వైద్యుల సంఖ్యను కూడా ప్రభావితం చేస్తుందని ఆమె హెచ్చరించారు. ఇప్పటికి డాక్టర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందనే విశ్వాసంతో ఉన్నామని ఆమె తెలిపారు.

నేడు దూబచర్లలో వైఎస్సార్ సీపీ ధర్నా

దేవరపల్లి: టీడీపీ నాయకులు, పంచాయతీ అధికారుల వేధింపుల కారణంగా పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దొబ్బిడి పెద్దిరాజు కుటుంబానికి న్యాయం చేయాలని, సంఘటనకు కారకులైన పంచాయతీ కార్యదర్శి, టీడీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం నల్లజర్ల మండలం దూబచర్ల సెంటర్లో ధర్నా నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహమణ్యం తెలిపారు. మాజీ హోంమంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ధర్నా కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, రాజమహేంద్రవరం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పలువురు పార్టీ నేతలు పాల్గొంటున్నట్టు ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జక్కంపూడి జయంతి వేడుకలు



దొమ్మేరులో కేక్ కట్ చేస్తున్న చెల్లుబోయిన వేణు, తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా తదితరులు

తాళ్లపూడి (కొవ్వూరు): మండలంలోని దొమ్మేరులో గ్రామంలో బుధవారం మాజీ మంత్రి జక్కంపూడి రాంమోహన్ రావు 72వ జయంతిని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్వర్యంలో నిర్వహించారు. వంగవీటి మోహన్ రంగా విగ్రహం, జక్కంపూడి చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా 100 మంది పేదలకు పళ్లు, దుప్పట్లు తలారి వెంకట్రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమని రమేష్, తాళ్లపూడి, చాగల్లు మండలాల కన్వీనర్‌లు కొలిశెట్టి నాగేశ్వరావు, మట్టా వెంకట్రావు, సర్పంచ్ తానేటి కుమారి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.